
# నెక్స్ట్  ట్రెయిన్

గంటి .... రాయ్

**ఆమె ఇంకా నిరీక్షిస్తూనేవుంది**
**ఎ వ రి కో స ం ?**

★

చీకటిలో చెట్లచాటున మళ్లీ ఆ దృశ్యాలు ఆమెకు కనబడ్డాయి కాబోలు! వేడిగా నిట్టూర్చింది. మా ప్రక్కనున్న పొద గలగలలాడి చనిపోయిన ఆ అనామికుల ఆత్మశాంతికోసం ప్రార్థించింది. ఆవిడ ఆ చెట్లతో యేదో భాషలో మాట్లాడుతున్నట్టో, లేక తన కష్టాలను నిశ్శబ్దంగా విని సానుభూతిని ప్రదర్శిస్తున్నందుకు కృతజ్ఞతను తెలియబరుస్తున్నట్టో, అటుప్రక్క చూస్తున్నది.

ఒకటి రెండు నిమషాలతర్వాత యే ప్రశ్న అడగడానికి తోచక అన్నాను: "కలకత్తానుండి యీ వూరు వచ్చేశారా ?"

ఆమె అతి ప్రయత్నంమీద నా ప్రక్కకు దృష్టి తిప్పింది. ఒకక్షణం నా ప్రశ్నను బోధపరచుకోడానికి వినియోగించి అంది: "లేదండీ కలకత్తా చేరగానే, తిన్నగా యిక్కడకే వచ్చేశాము. ఇక్కడ మా చెల్లెలూ, మరిదీ, పిల్లలూ ఉన్నారు. నేను రాగానే వాళ్ళయింటికి వెళ్లేను. నన్ను పలకరించలేదు సరికదా, మా విజయాన్ని అయినా పలకరించలేదు. మా మాసిన గుడ్డలూ, మా స్థితీ చూసి తిండికి లేకనే వాళ్ళ యింటికి వచ్చేమనుకున్నారు. తిండికోసాన్నే అయితే జపాన్ దేశం పోయే ముష్టి యెత్తుకుందును. వాళ్ళ యింట్లో విస్తరి వెయ్యలేదు. వాళ్ళ గుమ్మం మళ్లా తొక్కలేదు. మా బంగళాకు వచ్చేసి అందులో ఉంటున్నాను."

ఆమె తిరిగి దూరాన, చీకటిలోకూడా నల్లగా కనబడుతున్న పర్వతాలప్రక్క చూస్తూ, ఒకటి రెండు నిమషాలు నిశ్శబ్దంగా ఉంది. నావైపు చూడకుండానే కొండలతో చెప్తున్నట్టు అన్నాది "విజయానికి దారిలోపడ్డ కష్టాలచేతనైతేనేం అన్నకోసాన్ని బెంగచేతనైతేనేం, టి. బి. వచ్చి, యిక్కడికి వచ్చిన అయిదారు నెలలలోనే పోయింది."

ఆమె స్వరంలో, ఆమె మాటల పొందికలో దూరంగా ఛాయలలాగ కన్పిస్తున్న పర్వతాలలోని కారునలుపుదనం ప్రతిఫలిస్తున్నట్టు కనబడ్డాది.

ఆమె హృదయంలోనున్న సహారా యెడారి అంచులూ, వీస్తున్న వడిగాలుల కొసరివటలూ కొద్దిగా బోధపడ్డాయి. పాపం!

ఆమె కళ్లు మూసుకుంది దూరంగానున్న ఎలక్ట్రిక్ లైటు కాంతి ఆమె ముఖంమీద పడకుండా, బాగా ఎదిగిన (కోటను) చెట్టు యేదో అడ్డు వచ్చింది.

మరొక క్షణంలోనే గాలికి చెట్టుకొమ్మలు కదిలాయి. ఆమె తలమీద రెండు పండిన వెంట్రుకలు జాలిగా మెరిశాయి.

ఆమె అప్పుడే మాటలూ, భాషా నేర్చుకుంటున్నట్టు తాపీగా అన్నాది "అప్పటినుంచీ ఇక్కడే ఉంటున్నాను."

ఆమె ఇటూ అటూ చూసి యేదో దేవరహస్యం చెప్తున్నట్టు చెప్పింది: "అదీకాక రాముం తిన్నగా యిక్కడికే వస్తానన్నాడు. నేను యిక్కడ కనబడకపోతే బెంగపెట్టుకోడూ ?"

"రాముం అంటే మీ అబ్బాయా అండి ?"

---

* ఆనందవాణి

"అవును రామం అంటే కేప్టెన్ రామారావ్ మా—"

మరేమిటి చెప్పిందో నాకు వినబడలేదు.

కేప్టెన్ రామారావూ నేనూ క్లాస్‌మేట్సుమి'

మెగాడ్! ఈవిడ లలితపిన్ని. "రామం" అంటే మా రామమే!

★

లలిత పిన్ని డాక్టర్ నారాయణను వివాహం చేసుకోటం తల్లిదండ్రులకు తెలియకుండానే నిజానికి ముందుగా అతనితో బర్మా వెళ్ళిపోయి అక్కడ వివాహం చేసుకుంది. రామం, విజయం పుట్టేక, తల్లిదండ్రుల కోపం తగ్గింది. వాళ్ళు ఉత్తరాలు రాయగా పిల్లలను చూపించడానికి తీసుకొచ్చింది. తాతగారు పిల్లలను తనదగ్గరనే ఉంచేసుకున్నారు.

వాళ్ళూ, మేమూ యిరుగుపొరుగుగా ఉండే వాళ్ళం. రామం, నేను ఒకటే వాళ్ళ యింట్లోనో, ఒకటే మా యింట్లోనో ఉండేవాళ్ళము. లలిత పిన్ని తరుచు వస్తూండేది. ఆవిడకు నేనంటే ఎంతో ప్రేమా ఎంతో అభిమానమూను.

పండుగ వచ్చిందంటే మాకు నాకు తలంటి నీళ్ళుపోసేది. తాను స్వయంగా కాఫీ కలిపి యిచ్చేది. నాకు కోపంవచ్చి అలుగుతే మా అమ్మ వెళ్ళి లలితపిన్నిని తీసుకొచ్చేది. రామానికి కూడా ఏదైనా కావలసివస్తే నేను వెళ్ళి అడిగే వాణ్ణి.

మేమిద్దరం బి.ఏ. పాస్ అయ్యాక నేను ఉద్యోగంకోసం వచ్చేశాను: రామం బర్మా వెళ్ళిపోయాడు. అక్కడ మిలటరీలో చేరి, రంగూన్ మీద విమానదాడి' జరిగినప్పుడు చనిపోయాడనో శత్రువుల చేతిలో చిక్కుపోయాడనో పేపర్లో చదివాను.

అయితే యీవిడ లలితపిన్ని అన్నమాట!

కాని ఎంత మార్పు!

ఆనాడు ఆమె కళ్ళలో ఒక నవ్వుండేది. ఆమె నవ్వితే అప్పుడే విడ కలువలూ, మల్లెలూ, ప్రపంచంమీదకి వచ్చి కొద్దికొద్దిగా ఆక్రమిస్తున్న జ్యోత్స్నా, జ్ఞాపకం వచ్చేవి. ఆమెలో ఒక అపూర్వమైన ఏదో నిర్ధారించలేని మానవాతీత కనబడేది

నేడు ఆ ముఖంలో, పూర్వం ఉండే లాలిత్యం పిల్లలనుకూడా ఆకర్షించగల దృష్టులూ, నిశ్చింతా


రీటా

తలవెండ్రుకలను పెంచును



రీటా కుదుళ్ళకు బలమునిచ్చి, నిగనిగలాడు నిడుపాటి వెండ్రుకలను పెంచుటకు అద్భుతమైన హెయిర్ టానిక్. తలవెండ్రుకలు రాలుట, నెరయుట, చుండ్రు, బట్టతల, పేనుకొరుకు, ఇంకను తలవెండ్రుకలకు సంబంధించిన సమస్త వ్యాధులకు రీటా అమోఘముగ పనిచేయును. వేనకువేలు వాడి గుణమును పొందియున్నారు. మీరుకూడ నేటినుండి రీటానే వాడుడు.

రీటా హిందూదేశమంతటా దొరకును.

వెల సీసా 15 అణాలు



RITA
HAIR TONIC

లేవు. ఏదో తీరని చింతా, తన దేవుణ్ణి మరచిపోయిన భర్తని దృష్టిలోని ఆత్రుతా, ఏదో సుఖస్వప్నాన్ని సగంలో పోగొట్టుకున్న చంటిపాప చూపులలోని తృష్ణా, సర్వం పోగొట్టుకున్న ప్రియుని దృష్టులలోని ఆకలీ ఉన్నాయి.

ఈ సంగతులన్నీ ఆలోచిస్తూ దృశ్యాదృశ్యంగా కనబడుతున్న ఆ కొండలకైపు ఆమె తల మీదనుంచి చూస్తున్నాను. తలమీది పలితకేశాలు రెండు ఎగిరి సిల్హూట్‌గానున్న పర్వతపంక్తిమీద రెండు మెరుపులలాగ కనబడుతున్నాయి.

ఎంత మార్పు! ఆవిడదగ్గర పెరిగిన నేను కూడా పోల్చలేకపోయానంటే...?"

"మీరు తెలుసునా మా రామం?"

ఆమెలోని మాతృదేవి గర్వంతో, ఆత్రుతతో ప్రశ్నించింది. "బాబూ ఫోం చెయ్యలేదూ?" అని అలుపు తీర్చ ప్రయత్నిస్తున్న మా పిన్ని గొంతుకే అది! కాని, కొండలకు ఆవల మాట్లాడితే వచ్చిన ప్రతిధ్వనిలాగ ఉంది!

"పిన్నీ..." వాక్యం పూర్తికాకముందే ఆమె చప్పున లేచి నిలబడింది. నన్ను పరీక్షగా చూసింది.

నక్షత్రకాంతిలో ఆమె కళ్లు మెరుస్తున్నాయి. మరుపు మరగులలో విలీనమైపోతున్న స్మృతిరేఖలను పునర్విమర్శించుకోటంలో ఆమె నుదుటిమీద ముడతలు పడ్డాయి.

"నువ్వు బాబువి కాదూ?"

"అవును పిన్నీ."

"ఏదీ నాన్నా యిటు చూడు. ఎంత మారిపోయావ్? ఇప్పటివరకూ పోల్చలేకపోయాను."

ఒక లక్ష ప్రశ్నలు అడిగింది; అన్నిటికీ జవాబు చెప్పేను

చిన్నప్పుడు ఆమె ప్రక్కను కూర్చొని, సందు కొసనున్న బూచీ, తోటలో బూచీ, కొండమీద బూచీ గురించి చెప్పినట్టే ఆమె దగ్గరగా కూర్చొని నా కష్టాలూ, సుఖాలూ, జయాలు, అపజయాలు యీ పదేళ్ళలో నేను చేసిన ప్రయత్నాలు అన్నీ చెప్పేను.

నాటిలాగే నేడుకూడా ఆశ్చర్యాన్నీ, భయాన్నీ, ఆనందాన్నీ ప్రకటిస్తూ విన్నాది.

"అయితే నాన్నగారు చనిపోయారా? పాపం! అయినా, బాబూ, ఒక ఉత్తరమైనా రాయలేదేమోయ్."

"మీరు ఎక్కడ ఉన్నారో తెలిసిందికాదు పిన్నీ"

"అలాగా... అయితే—"

చాలా మెల్లిగా స్వరం తగ్గించి సాలోచనగా ప్రశ్నించింది: "మనవ్య రామం ఉత్తరాలు యేమీ వ్రాయలేదూ?"

చచ్చిపోయిన రామం ఉత్తరాలు ఎలా వ్రాయగలడని అనుకుంటున్నాదో? లేక రామం చచ్చిపోయాడన్న కబురే ఈవిడకు రాలేదో!

నేను జవాబు చెప్పకముందే రైలు లేటు అని చెప్పిన యువకుడు మా ప్రక్కకు వచ్చి, ఆమెకు నమస్కారంచేసి "రైలు వస్తున్నాదండి" అన్నాడు.

ఆమె తల గబగబ ఊపుతూ "సరే, ఫస్టు క్లాస్, సెకండు క్లాసులు జాగ్రత్తగా చూడు... రామంతో నేనిక్కడే ఉన్నానని చెప్పు. బాబు అంటే ఆయన అన్నమాట... కూడా తన కోసాన్ని వెయిట్ చేస్తున్నాడని చెప్పు."

"అలాగేనమ్మా."

అతడు రెండడుగులు వేసేసరికి 'వెంకట్రావ్' అని పిలిచింది. వెంకట్రావ్ వెనుకకు తిరిగేడు.

"చూడూ కోడూ, గొడుగూ మరిచిపోడం అలవాటు అబ్బాయికి. జాగ్రత్త సుమా."

"అలాగేనమ్మా."

దూరంగా రైలు వస్తున్న చప్పుడవుతున్నాది.

ఆమె కళ్ళలోని ఆత్రుతా, నిరీక్షణా, ప్రేమా ఆందోళనా, ఒక చెప్పలేని బాధా, తన ఆశ ఎక్కడ భగ్నమౌతుందో అన్న భయమూ, ఇవి అన్నీ కలిసి తొణికిసలాడుతున్నాయి.

దూరాన కనబడుతున్న పొగలప్రక్క కాబోలు ఆమె చూస్తున్నాది. నేను రెండో ప్రక్క చూశాను. ఆ ప్రక్క ఔటర్ సిగ్నల్ రెక్కలు వాలి లేవు.

రైలు వచ్చి ఆగింది.

సెక్రటరీ అటూ యిటూ తిరుగుతూ, ప్రతీ కారేజీ వెతుకుతున్నాడు. ప్రతీ వ్యక్తి ముఖాన్నీ పరీక్షగా చూస్తున్నాడు.

రైలు ఆగిన ఆ కొద్ది నిమిషాలూ రైలు భ్రామంతా ఆమె గుండెలలోనూ, కళ్ళలోనూ, నిల

బడినట్టే కనబడ్డాది. బరువుగా వస్తున్న ఉచ్ఛ్వాస నిశ్వాసములూ, ఆశా నిరాశల మధ్య కొట్లాడుతున్న దృష్టులూ, తన చిన్ని వేలు కదిపినా, రైలుకూడా ఎక్కడ కదులుతుందో అన్న భయంతో కాళ్లూ, జాలిగా ప్రక్కకు పడేసుకున్న చేతులూ ఆమెలోని ఆత్రుతను సూచిస్తున్నాయి.

రైలులోంచి దిగిన ప్రయాణీకులు వెళ్ళిపోతున్నారు. జాలిగా, బెంగగా, నీరసంగా వెలుగుతున్న ఎలక్ట్రిక్ దీపాల గ్రుడ్డివెలుతురులో, మరో లోకంలోంచి దిగి తమ తమ కర్మను నిశ్శబ్దంలో వెతుక్కుంటూ పోతున్న జీవులలా గున్నారు వారు.

"రాయ్ బాబూ" అని స్టేషన్ మాస్టరు పిలచేడు వరండాలో నిలబడి—

"ఇప్పుడే వస్తా పిన్నీ" అన్నాను; కాని ఆమె నా ప్రక్క చూడనే లేదు.

ఆనందరావు అక్కడ నిలబడి ఎంతసేపటినుంచి చూస్తున్నాడో తెలీదు. వెళ్లగానే ప్రశ్నించాడు "ఏమిటి, ఆవిడతో మాట్లాడుతున్నావు?"

"ఆవిడ మా లలితపిన్నోయ్."

"అంటే మీ అమ్మగారి—"

"అబ్బే...మా శాఖే కాదు. మా యింటి పొరుగున ఉండేవారు, ఆవిడ కొడుకు రామం, అంటే, కెప్టెన్ రామారావూ, నేనూ అన్నదమ్ములలాగ ఉండేవాళ్ళము, యీవిడంటే మా అమ్మకంటే గౌరవం హెచ్చు."

"ఆవిడలో మార్పేమైనా కనిబెట్టేవా?"

"జుత్తు కొద్దిగా తెల్లబడ్డా, అదే మనసూ, అదే వెర్రిప్రేమా, అదేవిధమైన అభిమానమూను."

"అంతేనా..."

పొగ వదుల్తూ నా ప్రక్క జాగ్రత్తగా, పరీక్షగా చూసాడు.

"మరేమీ మార్పు కనబడలేదూ?" అని ప్రశ్నించాడు.

"ఏమీ లేదు."

"వాళ్ళ అబ్బాయి రామం చచ్చిపోయాడు—అక్కడెక్కడో బర్మా ఫ్రంటులో—తెలుసా?"

"విన్నాను పేపర్లో చదివానుకూడా."

"నిజంగానే చచ్చిపోయాడుకూడా. రామం దగ్గరే ఉన్నాడు మా బ్రదరు. అతను చెప్పేడు. గవర్నమెంటుకూడా ఆ మాట వ్రాశారు. కాని యీవిడతో కొడుకు వారంపది రోజులలో వస్తానని చెప్పేడుట. అందుచేత, మా మాటలు నమ్మదు. వస్తాడనీ-యింకా ఏ రైలులోనో దిగి "అమ్మా, వచ్చేనమ్మా" అంటూ తనను పలుకరిస్తాడనీ-ఆవిడ నమ్మకం!"

అస్వాభావికంగా, చిన్నశబ్దంతో నవ్వేడు. ఒకటి రెండు క్షణాలు నేనేమైనా అంటానేమోనని ఆగి, మళ్లీ అన్నాడు—

"అదో రకం వెర్రి. పాపం, ఆ నమ్మకంతోనే ప్రతీరైలుకూ వస్తుంది, నెక్స్టు ట్రెయిన్ టైమింగ్సు కనుక్కుంటుంది - మేముకూడా సీరియస్ గా చెప్తుంటాం."

అతనిపళ్లు కొద్దిగా మెరిసాయ్, ఆ నవ్వులోతులోని విషాదాన్ని ఆనందరావు గ్రహించలేకపోయినా, నేను గ్రహించగలిగాను!

"తక్కిన అన్ని విషయాలలో, చాలా 'సేన్'గానే ఉంటుంది."

టంగ్ టంగ్ మని బెల్లూ.....రెండు మూడు పచ్చలైట్లూ.

"వస్తానుండు" అని పిన్నిదగ్గరకు వచ్చాను.

కీచుగా, బాధగా అరిచి బయలుదేరింది రైలు. నేను బెంచీని ఆనుకొని చూస్తున్నాను.

వెళ్ళిపోతున్న ఆ రైలులోంచి రామం తొంగి చూసి, తల్లినీ, నన్నూ ఆనవాలు పట్టి, ఏమో దిగిపోతాడేమో!

వెంకటరావు మెల్లగా ఆమెదగ్గరకు వచ్చి "రాలేదండి" అన్నాడు.

ఆమె హృదయాన్నే పట్టీలుగా చేసి రైలును దానిమీద నడిపిస్తే ఉండే బరువుతో, నిట్టూర్పు వదిలి "సరే" అంది—ప్రకృతిలోని ఆచంచలత్వానికీ, కర్మకూ తల వంచే జీవిలాగ.

ఒక్కక్షణం ఆగి, "నెక్స్టు ట్రెయిన్, టైము కనుక్కోనిరా" అంది.

నా ప్రక్క తిరిగి—"రామం యీ ట్రెయిన్లో రాలేదుటండీ-బహుశః నెక్స్టు ట్రెయిన్లో వస్తాడు" అంది ఆశగా.

నేను యింతవరకూ విన్న సంగతులన్నీ మరిచిపోయాను. ఏమో, రామం చచ్చిపోయాడన్న

వార్త అబద్ధం అయి వుండవచ్చు—"ఉండవచ్చు" నేమిటి? నిశ్చయంగా అబద్ధం!

నేను బెంచీమీద కూర్చొని, "అవును పిన్నీ" అన్నాను.

ఆమె అటూ యిటూ చూస్తున్నది, చెట్లు కూడా మెల్లిగా తలలు ఊపుతున్నాయి.

వెంకట్రావు వచ్చి, ఆమె గొడుగును తీసుకొని, పుల్లలను లెక్కపెడుతూ, "పొద్దున్న పావు తక్కువ తొమ్మిదికి" అన్నాడు.

"సరే, పద" అంది నిలబడి, నా ప్రక్క తిరిగి "ఏం, కూర్చున్నావేమీ? ఇంటికి రావూ?" అని ప్రశ్నించింది.

"లేదు పిన్నీ...ఒక స్నేహితునితో ఫోన్‌లో మాట్లాడాలని కూర్చున్నాను."

"సరే, పొద్దున్న మన బంగళాకు వస్తావు కాదూ? సెక్రటరీని పంపించనా, లేక...?"

కొద్దిగా సంకోచిస్తూ అన్నది: "రామం కూడా రాలేదా, పోనీ, నువ్వైనా దగ్గర ఉంటే."

ఆమెను ఆ వాక్యం పూర్తిచెయ్యనివ్వలేదు.

"తప్పకుండా వస్తా పిన్నీ, ఏడున్నరకల్లా వస్తా."

"కాఫీ అక్కడే తీసుకుందువు గాని" నవ్వుతూ అంది.

ఆమె మృదువుగా నా బుజ్జ పట్టుకొని—ఏం, చిక్కిపోతున్నావేమీ? రాత్రి చాలాసేపు మేలుకొని, ఏవో చదవటం, రాయటం మానలేదూ యింకా?"

దగ్గేను.

"అదుగో దగ్గుకూడా వస్తున్నది. సిగరెట్లు హెచ్చుగా కాలుస్తున్నావు కాదూ?"

"అబ్బె, లేదు పిన్నీ" చిన్నప్పుడు కోపం పడితే, యిదే స్వరంలో యిలాగే, అబద్ధం ఆడేవాణ్ణి.

నా తలమీద చెయ్యివేసి, మృదువుగా అంది—"వద్దు బాబూ, సిగరెట్టు కాలుస్తే నే యిలాగ దగ్గు, యిలాగ చిక్కిపోడమూను."

ఒక్క క్షణం ఆగి, "వస్తా మరి, పొద్దున్న ఏడున్నరకల్లా వెళ్ళిపోరా" అంటూ ముందడుగు వేసింది.

యుద్ధంలోకి వెళ్ళిన కుమారులూ, ప్రియులూ, సోదరులూ నేడో రేపో వస్తారని, వారు వస్తారన్న వాగ్దానాలను మననం చేసుకుంటూ, వారి కోసం హృదయద్వారాలనూ, గృహద్వారాలనూ తెరచుకొని, నిరీక్షిస్తూ, అనంతకాలంలోకి తొంగి చూడడానికి ప్రయత్నిస్తున్న కోటానుకోట్లు తల్లులూ, భార్యలూ, సోదరులూ, ప్రేమనూ దయారసాన్నీ, వెచ్చటి రక్తాన్నీ చిందుతున్న హృదయాలను చేతులతో పట్టుకొని, కనుసలలో వెలుతురులోంచి చీకటిలోనికి జారుతున్నట్టు కనబడ్డాది, ఆమె క్రోటన్సుచెట్లు మళ్ళుతుంటె.

పాపం, లలితపిన్ని నిరీక్షిస్తున్న "నెక్స్టు ట్రెయిన్" ఎప్పటికి వస్తుందో!

దూరంగానున్న ఔటర్ సిగ్నల్ ఒంటరిగా నిలబడి, మానవజీవితంలోని నెక్స్టు ట్రెయిన్ కోసం నిరీక్షిస్తున్నాది.

"టీ తాగుదాం రావోయ్, రాయ్ బాబూ" అని స్టేషన్‌మాస్టరు ఆనందరావు పిలచేడు.


కృష్ణవేణి సిరాలు




ఉల్లమలరఁ జేయు నల్లఁదనమునందు,
పరుగు తరుగు లేని పొందికలను,
ఎదకు నింపుఁగూర్చు కృష్ణవేణిసిరాలు
పొదలు కృష్ణవేణి నదిని బోలి.
మద్రాసు, దక్షిణజిల్లాలకు డిస్ట్రిబ్యూటరు:
సి. ఆర్. తిరుమల్‌పాడ్,
141, గోవిందప్పనాయకన్‌వీధి, మద్రాసు1.